ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో 2025-26 సంవత్సరానికి గానూ పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఎస్.సంధ్యారాణి మంగళవారం విలేకరులకు తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు https://apbragcet.apcfss.in ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతిలో దరఖాస్తు చేసుకొనే ఎస్సి, ఎస్టి విద్యార్థులు 2012 సెప్టెంబర్ నుంచి ఆగస్టు 2016 మధ్య జన్మించి ఉండాలని, అలాగే బిసి, ఒసి మైనారిటీ విద్యార్థులు 2014 నుంచి 2016 లోపు జన్మించి ఉండాలని ప్రిన్సిపల్ తెలిపారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తప్పక పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని అన్నారు..

పార్వతీపురంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

1/70 చట్టం జోలికి రావొద్దు

వామపక్ష, గిరిజన సంఘాల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజనుల జీవనాధారమైన 1/70చట్టం జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని గిరిజన, ఆదివాసీ, రైతు కూలీ సంఘాల నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఇటీవల స్పీకర్ అయ్యన్న పాత్రుడు 1/70 చట్టాన్ని సవరించాలని చేసిన వ్యాఖ్యలకు నిరసన గా 'ఏజెన్సీ బంద్" లో భాగంగా మంగళవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఒకవైపు జిఒ 3 లేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దూరమౌతున్న నేపథ్యంలో, మరో వైపు షెడ్యూల్డ్ గ్రామాల గుర్తిపు లేక, సరైన జీవన స్థితిగతులు కరువై అవస్థలు పడుతున్న గిరిజనులను అడవికి దూరం చేసి, బతుకులు లేకుండా, అటవీ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే చర్యలను చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు. 1/70 చట్టం రద్దు, సవరణ వంటి ఆలోచన మాను కోవాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీ స్థానిక సుందరయ్య భవనం నుండి ప్రారంభమైన పాత బస్టాండ్, రాయగడ రోడ్డు మీదుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు జరిగింది. ర్యాలీలో కడ్రక రామస్వామి (ఆదివాసీ గిరిజన సంఘం), పాలక రంజిత్ కుమార్ (గిరిజన సంక్షేమ సంఘం), జయలక్ష్మి (ఆదివాసీ హక్కుల వేదిక), నాయకులు ఎమ్. భాస్కర్ రావు (భాష) (రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్), బొత్స నర్సింగ రావు (అఖిల భారత రైతు కూలీ సంఘం), వి.ఇందిరా (శ్రామిక మహిళా సంఘం), పోలా రమణి (ప్రగతి శీల మహిళా సంఘం), ఎం.కృష్ణమూర్తి (రైతు సంఘం), తోట జీవ (సిపిఐ) యమ్మల మన్మథరావు, గొర్లి వెంకటరమణ, (సిఐటియు), డేవిడ్ (ఎస్ఎఫ్ఐ), బి.రవికుమార్ (ఎఐఎస్ఎఫ్), బి.సూరిబాబు, పి.సన్యాసిరావు (పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు), పి.సంగం (అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం (అయ్యార్ల), రాజు (రైతు కూలీ సంఘం నాయకులు), సర్వేశ్వరావు, సన్నిబాబు (పట్టణ వర్ధక కళాసి సంఘం) తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని గిరిశిఖర గ్రామాలైన నారింజపాడు, బొడ్డపాడు, కొత్తూరులో గిరిజన సంఘం, ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

కురుపాం : ఏజెన్సీలో గిరిజనేతరులు పెట్టుబడులు పెట్టేందుకు 1/70 చట్టం ఆటంకంగా ఉందని, గిరిజన చట్టాలను సడలించాలని, స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సిపిఎం జిల్లా కార్యదర్శి కోల్లి గంగునాయుడు ఆధ్వర్యాన మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన చట్టాలు, హక్కుల జోలికెళ్తే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు, కె.సీతారాం, పి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కురుపాంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు, గిరిజన సంఘం నాయకులు

పాచిపెంట : మన్యం బందులో భాగంగా పాచిపెంటలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జన్ని రామయ్య, సూకురు అప్పలస్వామి మాట్లాడుతూ ్న అసెంబ్లీ స్పీకర్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీరి ఆందోళనకు సిపిఎం నాయకులు రెడ్డి వేణు సంఘీభావం తెలిపారు.

కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కొర్ర కళ్యాణ్, జి.పోతయ్య, ఎస్. లక్ష్మణరావు, సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మన్యం బంద్‌లో మండలంలోని ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ ఆధ్వర్యాన ప్రచారం, కరపత్రాలు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో బిడ్డిక శంకర్రావు, బిడ్డిక సత్యం, గిరి తదితరులు ఉన్నారు.

కొమరాడ :మన్యం బంద్‌లో భాగంగా గిరిజనసంఘం, సిపిఎం నాయకులు మంగళవారం కొమరాడ మండల కేంద్రంలో బైక్ ర్యాలీ, వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు పి శ్రీను నాయుడు, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు హెచ్.రామారావు, వెంకటేష్, బోడియ రామస్వామి, రెడ్డి శివున్నాయుడు, ఉపేంద్ర, పాండు, రామారావు, నారప్పడు పాల్గొన్నారు.

పాచిపెంటలో ప్రచారం చేస్తున్న గిరిజనసంఘాల నాయకులు: కొమరాడలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

యూనిట్ల స్థాపనకు క్లస్టర్ల గుర్తింపు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రధాన మంత్రి ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ (పిఎంఎఫ్ఇ) కింద జిల్లాలో కుటీర ఆహార పరిశ్రమల యూనిట్ల స్థాపనకు క్లస్టర్లను గుర్తించి, నెలకొల్పాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ప్రతి మండలంలో కనీసం ఐదు యూనిట్లు స్థాపించాలని, వారం రోజుల్లోగా మంజూరు ప్రక్రియ పూర్తికావాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. దీనిపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం కలెక్టర్ తన కార్యాలయంలో సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా 75 కుటీర ఆహార యూనిట్లు స్థాపన లక్ష్యం కావాలని అధికారులను ఆదేశించారు. రైతులు, ఎస్‌హెచ్‌జి బృందాలు, వ్యక్తిగత యూనిట్లు స్థాపించుకునేలా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు. యూనిట్ల స్థాపనకు లబ్ధిదారుని వాటా 10 శాతం కాగా, 35 శాతం వరకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, 55 శాతం పెట్టుబడిని బ్యాంకులు రుణంగా మంజూరు చేస్తాయని అన్నారు. ప్రాజెక్ట్ సమగ్ర నివేదిక (డీపీఆర్) రూపకల్పనకు కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. యూనిట్ల స్థాపనకు స్త్రీనిధి నుంచి నిధులను మంజూరు చేస్తామన్నారు. అనంతరం ప్రాథమిక రంగాల వృద్ధిపై సమీక్షించారు. ప్రతి మూడు మాసాలకు ఉత్తమ సేంద్రియ రైతులకు అవార్డులను ప్రకటించి ప్రోత్సాహించాలన్నారు. పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఉద్యాన వన పంటలు ఎక్కువగా పండించేలా రైతులకు అవగాహన కల్పించాలని, కౌలు రైతులకు క్రెడిట్ కార్డులను మంజూరు చేయాలని అన్నారు. మత్స్య సంపద వృద్ధికి జిల్లా అనుకూలమని, 58 శాతం నీటి వనరులు ఉన్నాయని గుర్తుచేశారు. జిల్లాలో పశు సంవర్ధక శాఖ పనితీరు బాగుందని కితాబిచ్చారు. ప్రాథమిక రంగాలపై సంబంధిత అధికారులు మరింత వృద్ధి సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ, ఉద్యాప, మత్స్య, పట్టు, పశు సంవర్ధక శాఖల అధికారులు కె.రాబర్ట్ పాల్, కె.మణిభూషణరావు, వి.తిరుపతయ్య, ఎ.వి.సాల్మన్ రాజు, డా.ఎస్. మన్మధరావు, ఎల్డీఎం ఎన్.విజయ స్వరూప్, డీఆర్డీఏ పీడీ వై.సత్యం నాయుడు, కేవికె శాస్త్రవేత్త డా.శ్రీనివాస్ రాజు, పీఎంఎఫ్ఎఈ జోనల్ మేనేజర్ ఐ.శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిఒ3 పునరుద్ధరణకు హామీ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిఒ3 పునరుద్ధణ హామీకి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఒక ప్రకటన విడుదల చేశారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ దృష్టికి జిఒ 3 అంశం తీసుకురాగానే పునరుద్ధరించడానికి కృషి చేస్తామని, న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారని అన్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్న వివిధ పార్టీలు, ప్రజా సంఘాల్లో గల నాయకులకు విజ్ఞప్తి చేశారు. 1/70 ఎటువంటి మార్పు రాదు అన్నారు.

పెద్దఖర్జ పాఠశాలకు నడుచుకొని వెళ్తున్న బుడ్డిడికి చెందిన చిన్నారులు

చదువు కోసం తప్పని తిప్పలు

2కిలో మీటర్ల దూరం నడిచి వెళ్తున్న చిన్నారులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

చదువుకోవాలనే తపన, ఆసక్తి, ఆరాటం ఉన్న ఆ చిన్నారులకు కాలిబాట కష్టాలు తప్పడం లేదు. గ్రామంలో పాఠశాల లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పొరుగు గ్రామానికి వెళ్లి వస్తున్నారు. దీంతో తమ పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన వస్తుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని పెదఖర్జ పంచాయతీ బుద్దిడి గ్రామ విద్యార్థులు చదువుకునేందుకు పెదఖర్జ గ్రామానికి వెళ్లి వస్తున్నారు. గ్రామంలో ఉన్న ఎయిడెడ్ పాఠశాల మూతపడడంతో స్థానికంగా విద్యార్థులకు చదువు దూరమైంది. 1947లో బొద్దిడి ఎయిడెడ్ పాఠశాలను ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడ పని చేసిన ఉపాధ్యాయులు ఒకరి తర్వాత ఒకరు ఆరేళ్ల క్రితం ఉద్యోగ విరమణ చెందారు. ప్రభుత్వం ఆ పోస్టులను భర్తీ చేయకపోవడంతో పాఠశాల పూర్తిగా మూతపడింది. దీంతో ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరం ఉన్న పెదఖర్జ నడుకుంటూ పాఠశాలకు వెళ్తాన్నారు. దీంతో తమ పిల్లలు అనారోగ్యం బారినపడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఐదో తరగతి విద్యార్థిని భవ్యశ్రీ తలసేమియా, మరో విద్యార్థినికి హార్ట్ ప్రాబ్లం ఉన్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. అలాగే పాఠశాలకు వెళ్లే మార్గంలో గెడ్డవాగుతో వర్షాకాలం వస్తే ఇబ్బందులు తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ రాకపోకలు సాగించాల్సి వస్తుందన్నారు. ఏజెన్సీలో విద్యాభివద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తామని చెబుతున్నా ఆచరణలో మాత్రం కానరావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని బొద్దిడి గ్రామస్తులు కోరుతున్నారు.

టెన్త్ ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ పరిధిలోని పదో తరగతి చదివే విద్యార్థులంతా పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతను సాధించాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సహాయ గిరిజన సంక్షేమ అధికారులు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల పాఠశాలల ప్రధానాచార్యులు, వసతి గృహ సంక్షేమ అధికారులతో పదో తరగతి పరీక్షల నిర్వహణపై పిఒ సమీక్షించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులంతా శత శాతం ఉత్తీర్ణత సాధించేలా సంబంధిత ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సి,డి గ్రేడ్ విద్యార్థుల పట్ల సబ్జెక్టు టీచర్లు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, తర్ఫీదు ఇచ్చి వారిని బి6గ్రేడ్ లోనికి తీసుకురావాలని ఆదేశించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా తగిన కౌన్సిలింగ్ ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. సికెల్ సెల్, అనీమియాతో బాధపడుతున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వారికి స్పెషల్ డైట్ అందించాలని తెలిపారు. ప్రతి 40 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు అడాప్ట్ చేసుకొని నిరంతరం వారి ప్రవర్తన పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. విద్యార్థులను వారి తల్లిదండ్రులతో ఇంటికి పంపినప్పుడు విధిగా, అందుకు గల కారణాలను రాత పూర్వకంగా తీసుకోవాలని చెప్పారు. ప్రతిభ పాఠశాల, జోగింపేటకు ఇతర గిరిజన సంక్షేమ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి సమస్యను పరిష్కరించామని వివరించారు. గిరిజన సంక్షేమశాఖ డిడి ఆర్.కృష్ణవేణి మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో శత శాతం ఉత్తీర్ణతతో పాటు విద్యార్థులు ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వాటి బాధ్యత పీడీ, పీఈటీలకు అప్పగించాలని ఆదేశించారు. వండిన ఆహార పదార్థాలను ప్రధానోపాధ్యాయులు క్రమం తప్పకుండ రుచి చూడాలన్నారు. మరుగుదొడ్లకు విద్యుత్, నీటి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. స్వచ్ఛ ఆంధ్ర , స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి 3వ శనివారం పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా చేసుకోవాలని తెలియజేశారు. నివాస్ పోర్టల్ లో విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ పి.సిహెచ్.మోహన రాయుడు, కురుపాం, గుమ్మలక్ష్మీపురం ఎటిడబ్ల్యుఒలు కె.చంద్రబాబు, బి.సురేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

శతశాతం సాధించాలి: డిఇఒ

పాచిపెంట: పదో తరగతి విద్యార్థులంతా పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని డిఇఒ ఎన్ తిరుపతి నాయుడు పేర్కొన్నారు. మండలంలోని కొత్తవలస జెడ్‌పిహెచ్ఎస్, కెజిబివి పాఠశాలలను ఆయన సందర్శించారు. పరీక్షల్లో విద్యార్థులంతా శత శాతం ఉత్తీర్ణత సాధించేలా సంబంధిత ఉపాధ్యాయులు కృషి చేయాల న్నారు. సి,డి గ్రేడ్ విద్యార్థుల పట్ల సబ్జెక్టు టీచర్లు ప్రత్యేక శ్రద్ధ కనబర్చి తర్ఫీదిచ్చి వారిని ముందుకు తీసుకురావాలని సూచిం చారు. ఆయన వెంట ఎంఇఒలు పి.జోగారావు, పి.సతీష్ కుమార్. కెజిబివి ఎస్ఒ షేక్ నజియా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటోలో వాసవి మృతదేహాన్ని తరలిస్తున్న కుటుంబీకులు

అయ్యో పాపం!

- ఆటోలో వాసవి మృతదేహం తరలింపు
- భద్రగిరి ఆస్పత్రికి కేటాయించని మహాప్రస్థాన వాహనం
- ప్రైవేటు వాహనాలే దిక్కు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతురు దూరమైందని ఒకవైపు గుండెలను పిండేలా రోధిస్తుంటే మరోవైపు పోస్టుమార్టం కోసం తరలించేందుకు ఆ తండ్రి పడిన కష్టం అంతా ఇంత కాదు. సోమవారం పురుగులు మందు తాగి మృతి చెందిన విద్యార్థిని పువ్వల వాసవి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి ఆటోలో తరలించారు. స్థానికంగా పోస్టుమార్టం ఉన్నా విద్యార్థిని మైనర్ కావడంతో పార్వతీపురం తరలించాల్సి వచ్చింది. మహాప్రస్థానం అంబులెన్స్ కూడా అందుబాటులో లేకపోవడంతో గిరిజనులు వేలాది రూపాయలు ఖర్చుపెట్టి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు పోస్టుమార్టం గదిలో ఫ్రీజర్, ఫ్రిజ్‌లు ఏర్పాటు చేయలేదు. పోస్టుమార్టం అనంతరం తీసే వస్తువులను భద్రపరచడానికి వీలులేకపోవడంతోనే పార్వతీపురం తరలించాల్సి వస్తుంది. మహాప్రస్థానం అంబులెన్స్‌ను భద్రగిరి ఆసుపత్రికి కేటాయించాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అధికారులను ఇదివరకే కోరారు. పోస్టుమార్టం గదిలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని, సాధ్యమైనంత త్వరగా మహాప్రస్థానం అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని ఈ ప్రాంత గిరిజనులుకోరుతున్నారు.

రాష్ట్రపతికి లేఖలను పోస్టు ద్వారా పంపుతున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

వేతన చట్టం అమలుకు రాష్ట్రపతికి అంగన్వాడీల లేఖలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుతో పాటు వేతన చట్టం అమలు చేయాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ ఆధ్వర్యంలో పోరాటాన్ని ముమ్మరం చేస్తున్నామని,దీనిలో భాగంగా రాష్ట్రపతికి జిల్లా అంగన్వాడీలు లేఖల ద్వారా వినతులు పంపిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.సరళకుమారి, జి.జ్యోతిలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు రాసిన 2800 లేఖలను పోస్ట్ ఆఫీస్ ద్వారా భారత రాష్ట్రపతికి పంపించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు మినీలు అనేక సేవలు అందిస్తున్నారన్నారు. ఈకేంద్రాల నిర్వహణకు రకరకాలు పెట్టుబడులు పెట్టి నిర్వహిస్తున్నామన్నారు. వేతనాలు పెంపు, తదితర సమస్యల పరిష్కారం కొరకు 42 రోజుల పాటు సమ్మె నిర్వహించామన్నారు. సమ్మె ముగింపు సందర్భంగా అంగన్వాడీలకు 2024 జులైలో వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని మినిట్స్ ఇచ్చినా నేటికీ ఈ సమస్య పరిష్కారం కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై ఈనెల 12న ప్రాజెక్ట్ ఆఫీసుల వద్ద ధర్నా చేస్తున్నామని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలను మూడో తరగతి, ఆయాలను నాలుగో తరగతి ఉద్యోగులుగా చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, బడ్జెట్లో అంగన్వాడీలకు బడ్జెట్ పెంపుదయలు చేయాలని జిల్లా అంతా 2800 లేఖలను పంపిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ పార్వతీపురం ప్రాజెక్టు కార్యదర్శి గౌరీ మణి, సెక్టార్ నాయకులు గౌరి, రాజేశ్వరి, భారతి, సిఐటియు ఇందిర పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - సీతంపేట

రానున్న ఎపిడిమిక్ సీజన్‌లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సిబ్బంది టూర్ డైరీ తప్పనిసరిగా నిర్వహించాలని డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు అన్నారు. స్థానిక వైటిసిలో మండలంలో గల దోనుబాయి, కుసిమి, మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫీవర్ సర్వే రెగ్యులర్ చేయాలన్నారు. ప్రసవాలకు వారం రోజులు ముందే భర్త వెయిటింగ్ హాల్లో ఉంచాలన్నారు. పీజీకి 12మంది వైద్యులు వెళ్తున్నారని, ఆ పోస్టులు భర్తీకి కలెక్టర్‌కు ప్రతిపాదన పంపించామని చెప్పారు. మూడు లక్షల దోమతెరల ప్రతిపాదనలు పంపించామని అన్నారు. స్ప్రేయింగ్ స్పెషల్ రౌండ్ కింద 90 రోజులకు మూడు రౌండ్ల స్ప్రేయింగ్ నిర్వహిస్తామని చెప్పారు. వైద్య అధికారులు ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో స్ప్రేయింగ్ చేయాలన్నారు. విద్యార్థులకు తనిఖీలు చేయాలన్నారు. గ్రామాల్లో స్ప్రేయింగ్‌పై దండోరా చేయించాలన్నారు. అంతకుముందు దోనుబాయి, మర్రిపాడు పిహెచ్‌సిలను సందర్శించారు. అనంతరం వైటిసిలో గల గర్భిణి వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.విజయ, లెప్రసీ అధికారి వినోద్ కుమార్, వైద్యులు సాయిచరణ్, భాను ప్రతాప్, చాందిని, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి - మక్కువ

పోలమాంబ అమ్మవారి మూడో వారం జాతరకు మారువారం జాతరకు మించి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. రెండవ వారం రథసప్తమి కారణంగా అమ్మవారి ఆలయా లను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు కాస్త తగ్గినప్పటికీ మూడో మంగళవారం మాత్రం భక్తజనంతో ఆలయాలు కిటకిటలడాయి, వనం, చదురు గుడుల వద్ద భక్తులు అమ్మవారిని దర్శించుకు న్నారు. దేవాదాయ శాఖ ఇఒ సూర్యనారా యణ భక్తుల రద్దీ దృష్ట్యా తగిన ఏర్పాట్లు చేపట్టారు. ఎస్ఐ వెంకటరమణ నేతృత్వం లో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రభుత్వ విప్‌ల సమావేశానికి ఎమ్మెల్యే హాజరు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెలాఖరు నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా ముందస్తుగా ప్రభుత్వ చీఫ్ విప్‌తో ప్రభుత్వ విప్‌ల సమావేశం అమరావతిలో మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు.

విజయగౌరికి మద్దతుగా యుటిఎఫ్ ప్రచారం

ప్రజాశక్తి - భామిని

ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయ గౌరిని గెలిపిం చాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహన రావు కోరారు. ఈ మేరకు మండలంలోని పెద్దదిమిలి, భామిని, బాలేరు, బత్తిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కెజిబివి మోడల్‌స్కూల్, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో శ్రమిస్తున్న యుటిఎఫ్ బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరిని గెలిపిం చాలని కోరారు. ప్రచారంలో యుటిఎఫ్ భామిని మండలశాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇ.తిరుపతి రావు, కె.ప్రసాద్, జిల్లా కౌన్సిలర్లు కె.క్రాంతికుమార్, పి.లుడతాచిన్, సిహెచ్.మార్కోయస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భామిని మోడల్ హైస్కూల్‌లో ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

కురుపాం : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి గెలుపునకు సహకరించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్ కోరారు. మంగళవారం కురుపాంలో పలు పాఠశాలల్లో ప్రచారం చేశారు. ఉపాధ్యాయ హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎన్.శ్రీరాములు, వి.చలపతిరావు పాల్గొన్నారు.

వీరఘట్టం : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని యుటిఎఫ్ నాయకులు వీరఘట్టంలో ఇంటింట ప్రచారం చేపట్టారు. మీ మొదటి ప్రాధాన్యత ఓటు విజయ గౌరికి వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎం పైడిరాజు, బి దుర్గ ప్రసాద్, కె.గోవిందరావు, గౌరు నాయుడు, ఎస్.గణేష్, ఎ. చంద్రమోహన్, తదితరులు ఉన్నారు.

సర్వే అధికారులకు సూచనలు ఇస్తున్న జెసి శోభిక

రీసర్వేను తనిఖీ చేసిన జెసి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేటలో జరుగుతున్న రీ సర్వేను జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభిక మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రీ సర్వే చేపడుతున్న ప్రక్రియను పరిశీలించి, సర్వే అధికారులను అడిగి తెలుసుకున్న ఆమె పలు సూచనలు చేశారు. రీసర్వేతో ప్రజలకు, రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లరాదని తహశీల్దార్, సర్వే అధికారులను ఆమె ఆదేశించారు. అనంతరం రైతులతో మాట్లాడి రీ సర్వే జరుగుతున్న తీరుపట్ల అభిప్రాయాలను జెసి అడిగి తెలుసుకొని, సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో తహశీల్దార్, సర్వే అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలో ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ పి.బాల మురళీకృష్ణ హెచ్చరించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బెల్ట్ షాపులు, నాటుసారా విక్రయిస్తున్న వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట విరుద్ధమైన వ్యాపారాలు చేసి భవిష్యత్తును పాడుచేసుకోవద్దన్నారు. అనంతరం ఒక్కొక్కరికి లక్ష రూపాయలు పూచీకత్తు తో బైండోవర్ చేశారు. ఈ విచారణలో ఎక్సైజ్ ఎస్సై ఫణీంద్ర బాబు ఉన్నారు.

గిరిజన హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన హక్కుల పరిరక్షణపై తమ కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచెర్ల వీరేశ్ చంద్రదేవ్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ 1/70 చట్టాన్ని మార్చే ఉద్దేశం లేదని, గిరిజన భూములు గిరిజనులకే చెందాలనే సిద్ధాంతానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని, గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం అంకితభావంతో పని చేస్తూ జీవో 3 ద్వారా గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు గిరిజనులకు మాత్రమే దక్కేలా చట్టబద్ధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. గిరిజన జాతుల పరిరక్షణ భారతీయ సంస్కృతిని కాపాడుకోవడమేనని ప్రభుత్వ విధానమని అందుకే గిరిజనుల విద్య, వైద్యం, జీవన ప్రమాణాల మెరుగుదలకు నిరంతర కృషి చేస్తూనే అరకు కాఫీతో సహా గిరిజన ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడానికి ప్రభుత్వం కషి చేస్తుంది అన్నారు.

1/70 చట్ట సవరణ మార్చే ఆలోచన ప్రభుత్వానికి లేదు

ప్రజాశక్తి - పాలకొండ

1/70 చట్టాన్ని సవరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తేజోవతి అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్షం లేనిపోని ఆరోపణలు చేసి ప్రజలను మాయచేస్తుందన్నారు. 1/70 చట్టాన్ని పరిరక్షిస్తామన్నారు. ఆదివాసీ చట్టాలను అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గిరిజనులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

వివాహాల రిజిస్ట్రేషన్‌కు ఖాజీ నియామకం చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ముస్లింల వివాహ చట్టం ప్రకారం వివాహాల రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వం తరపున ఖాజీ నియామకం చేపట్టాలని జామియా మసీద్ జిల్లా కమిటీ అధ్యక్షులు సయ్యద్ ఇబ్రహీం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా నాయకులతో కలిసి ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోరారు. కార్యక్రమంలో జామియామసీద్ మత పెద్దలు మొలానా ఫారుఖ్,హరుణ్ గని గారు,యాసీన్ బాబా ,గౌస్, రజాక్, షఫీ జలాల్, బుజ్జి, ఇబ్రహీం, బాబ్జాని, అజిముల్లా తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు

ప్రజాశక్తి - పాచిపెంట

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి నాయకులు చౌకుబారు విమర్శలు చేస్తున్నారని మండల టిడిపి నాయకులు అన్నారు. మంగళవారం పి.కోనవలసలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ముఖీ సూర్యనారాయణ. గూడెపు యుగంధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివద్ధిని చూసి వైసిపి నాయకుల అడ్రస్సులు గల్లంతు అవుతాయనే భయంతో మంత్రి సంధ్యారాణిపై చౌకుబారు విమర్శలు చేస్తున్నారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచినప్పటి నుంచి నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న తమ మంత్రిని చూసి రాజన్నదొర మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో అమలవుతున్న 1/70 చట్టాన్ని మార్చే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి లేదని దీన్ని మరింత పకడ్బందీగా పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గిరిజనులు ఎవరూ ఆందోళన చెందొద్దని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు చల్లా కనక, కొత్తల పోలినాయుడు, మతల బలరాం, కొట్యాడ సత్యనారాయణ, పల్లెడ ఉమా, పి.నరసింగరావు, మాదిరెడ్డి మధవరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనదారులకు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని స్థానిక ఎస్సై పి. నారాయణరావు అన్నారు. కురుపాంలోని ప్రదీప్ నగర కాలనీ సమీప ప్రధాన రహదారి వద్ద మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. ఇంతవరకు అపరాధ రుసుం చెల్లించని వారిచే వెంటనే కట్టించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. రహదారి భద్రత నియమాలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించిన ఛైర్మన్

ప్రజాశక్తి - పాలకొండ

నగర పంచాయతీలో గల ఇందిరానగర్ కాలనీలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఛైర్మన్ పల్లా ప్రతాప్, కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. సిపిఎం బృందం సోమవారం ఇందిరానగర్ కాలనీలో పర్యటించి సమస్యలను గుర్తించింది. ఈ మేరకు మంగళవారం ఛైర్మన్, కమిషనర్ సర్వేశ్వరరావు ఆ కాలనీలో పర్యటించారు. కాలనీలో మురికి కాలువను పరిశీలించి సిబ్బందికి అక్కడ ఉన్న పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాలువలు అధ్వానంగా ఉండడంతో ప్రజలు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారని ఛైర్మన్ దృష్టి సిపిఎం నాయకులు దావాల రమణా రావు తీసుకొచ్చారు. కాలువలను వెంటనే శుభ్రపరచాలని ఆయన కోరారు వెంటనే పనులు చేపట్టాలని కమిషనర్ సర్వేశ్వరరావుకు ఛైర్మన్ సూచించారు. దీనికి కమిషనర్ కూడా స్పందించి ఎఇతో మాట్లాడి పనులు చేపడతామని చెప్పారు. వీరితో పాటు వార్డ్ కౌన్సిలర్ అడపా బాబాజీ నాయుడు ఉన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

మున్సిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులతో కలిసి ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ పొరుగు సేవల కార్మికుల కోసం గత వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్ రద్దు చేయాలని ఇటీవల జరిగిన మంత్రివర్గం తీర్మానించినట్లు పత్రికల్లో వార్త వచ్చిందన్నారు. ఈ ప్రకటనతో ఆప్కాస్‌లో ఉన్న పొరుగు సేవల కార్మికులందరిలోనూ తీవ్ర భయాందోళన నెలకొందని, ఆప్కాస్ రద్దు చేస్తే తిరిగి దళారీ వ్యవస్థ రంగంలోకి వస్తుందని, ఉద్యోగులకు భద్రత లేకుండా పోయే ప్రమాదం ఏర్పడనుందని, కావున ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం దళారీ వ్యవస్థను రద్దుచేసి ఉద్యోగులను పర్మనెంట్ చేస్తామన్న హామీని కార్మికులంతా నమ్మారని, కానీ గత ప్రభుత్వం హామీని అమలు చేయలేదని విమర్శించారు. దళారీ వ్యవస్థ స్థానంలో ప్రభుత్వమే మధ్యవర్తి పాత్ర పోషించే ఆప్కాస్ వ్యవస్థను తెచ్చిపెట్టిందన్నారు. ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుచేసి ఒప్పంద కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తుందని కార్మికులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారని, అందుకు భరోసా ఇవ్వకపోగా ఆప్కాస్‌ను రద్దుచేసి తిరిగి దళారీ వ్యవస్థను తెచ్చిపెడుతుందనే ప్రచారం జరగడం తీవ్ర విచారకరమని అన్నారు. తక్షణమే మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన ఒప్పంద కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సింహాచలం, శంకర్రావు, శివ, రాజేష్, సంతు, నరేష్, గంగయ్యలు, గంగరాజు, మజ్జి, అప్పారావు, రవి, విప్పల అమ్మ, కాపులమ్మ, శాంతి, తదితరులు పాల్గొన్నారు

మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

గిరిజన విద్యార్థిని మృతి బాధాకరం : డివిజి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లంక జోడు ఆశ్రమ పాఠశాల గిరిజన విద్యార్థిని పువ్వల వాసవి మృతి అత్యంత బాధాకరమైన ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డివిజి శంకర్రావు అన్నారు. విద్యార్థిని మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆమె మృతికి గల కారణాలను కోరుతూ తగును నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులకు కోరినట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షలు ముందు ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరమన్నారు. విద్యార్థుల మానసిక పరిస్థితిపై కూడా ఉపాధ్యాయుల పరిశీలన ఉండాలన్నారు. విద్యార్థుల మానసిక పరిస్థితి బాగా లేకపోతే కౌన్సిలింగ్ చేయడం సంబంధిత అధికారులు దృష్టికి తీసుకొచ్చి మానసిక కౌన్సిలింగ్ చూపించాలన్నారు. భవిష్యత్తులో విద్యార్థుల మరణాలు జరగకుండా సంబంధిత అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శంకర్రావు సంబంధిత అధికారులను ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ రవిప్రసన్నకుమార్

ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ముత్యాలు గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డిఇఒ కె.రవిప్రసన్నకుమార్ మంగళవారం సందర్శించారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు దగ్గర పడ్డాయని ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. వెనుకబడిన విద్యార్థులను ముందుకు తీసుకురావాలని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం అడిగి తెలుసుకున్నారు. శత శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలన్నారు. ఆయనతో పాటు ప్రధానోపాధ్యాయులు హెచ్.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

రాకపోకల సౌకర్యం కల్పించండి

ఎమ్మెల్యేకు గాంధీనగర్ వాసుల వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని బెలగాం రైల్వే స్టేషన్ దగ్గరలో నివాసం ఉంటున్న 14వ వార్డు గాంధీనగర్ ప్రజల రాకపోకలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర రైల్వే అధికారులను కోరారు. పట్టణంలో బెలగాం రైల్వే స్టేషన్ దగ్గరలో నివాసం ఉంటున్న 14వ వార్డుకు రైల్వే స్థలం ఆనుకొని ఉన్న రహదారికి రైల్వే అధికారులు గోడ కట్టి మూసి వేయడంతో స్థానిక గాంధీనగర్ ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతుండంతో ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఎమ్మెల్యే మంగళవారం గాంధీనగర్‌కు చేరుకొని ప్రజలతో మాట్లాడారు. అనేక ఏళ్లుగా ఈ ప్రాంతంలో నివాసముంటున్నామని, గోడకట్టడం వల్ల దీర్ఘకాలిక రోగులు బయటకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యేకు తెలిపారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే రైల్వే డిఆర్ఎం, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి గోడ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. సంబంధిత రైల్వే ఇంజనీరింగ్ అధికారులు సానుకూలంగా స్పందించి త్వరలోనే మార్గాన్ని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. అనంతరం రైల్వే స్టేషన్‌లోని ఆధునీకరణ పనులను ఎమ్మెల్యే వి పరిశీలించి, ప్లాట్‌ఫామ్ 2, 3 మధ్యలో ఉన్న ప్రయాణికులు నడిచేమెట్లు బ్రిడ్జి వెడల్పు చిన్నదిగా ఉందని, దీంతో ప్రయాణికులు రద్దీగా ఉన్నప్పుడు ఇబ్బంది పడుతున్నారని, వాటిని వెడల్పు చేయాలని రైల్వే అధికారులను కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయచంద్రకు సమస్యలను వివరిస్తున్న గాంధీనగర్ వాసులు

టిడిపి నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలి

ప్రజాశక్తి - సాలూరు

మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర తన రాజకీయ ప్రస్థానంలో ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తల పట్ల ఎంత కక్షపూరితంగా పని చేశారో టిడిపి నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలని మెంటాడ ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు, పట్టణ వైసిపి నాయకులు పిరిడి రామకష్ణ, ఎన్.కళ్యాణ్ కోరారు. మంగళవారం రాజన్నదొర నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఏనాడూ రాజన్నదొర ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలను అణగదొక్కాలని చూడలేదని చెప్పారు. ఆయన అధికారపార్టీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎంతోమంది టిడిపి నాయకులు, కార్యకర్తలు లబ్ధి పొందారని చెప్పారు. మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డిని మంత్రి సంధ్యారాణి విమర్శించే విధానం బాగులేదని మాత్రమే రాజన్నదొర తప్పుపట్టారని చెప్పారు. పార్టీ విధానాల పరంగా విమర్శలు చేసుకోవచ్చునని, వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని అన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి విషయంలో ఎప్పుడైనా చర్చకు సిద్ధమేనని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో పట్టణ టిడిపి కౌన్సిలర్లందరికీ అంగన్వాడీ ఉద్యోగాలు, వర్కులు ఇప్పించిన ఘనత ఆయనదని చెప్పారు. 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వం హయాంలో మోసూరు, కందులపథం వంతెనలకు శంఖుస్థాపన చేసి వదిలేస్తే ఎమ్మెల్యేగా రాజన్నదొర ఆ పనులు పూర్తి చేయించారని చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు దాటుతున్నా నియోజకవర్గంలో జరిగిన అభివద్ధి ఏమిటని ప్రశ్నించారు. ప్రజలు వాస్తవాలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెపుతారని తెలిపారు..

వాదోపవాదాలతో ముగిసిన మండల సమావేశం

ప్రజాశక్తి - సాలూరు

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా మండల సర్వసభ్య సమావేశంలో ఎటువంటి తీర్మానాలు చేయకపోవడంతో అధికారులతో సమీక్షకే పరిమితమైపోయింది. మంగళవారం ఉదయం ఎంపిపి గరుగుబిల్లి రాములమ్మ అధ్యక్షతన వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ కుమార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టిన, చేపడుతున్న పనుల గురించి సభ్యులకు వివరించారు. అందులో భాగంగా ఐసిడిఎస్ సిడిపిఒ విజయలక్ష్మి మాట్లడుతూ ఉపాధి హామీ పథకం కింద పలు అంగన్వాడీ కేంద్రాలకు మరుగుదొడ్లు మంజూరయ్యాయని చెప్పారు. దీనికి వైస్ ఎంపిపి స్పందిస్తూ, ఎప్పుడు మంజూరయ్యాయి, ఎవరు ప్రతిపాదనలు తయారు చేసి పంపించారు, ఏఏ పంచాయితీలకు మంజూరయ్యాయని ప్రశ్నించారు. అలాగే తమకు తెలియకుండా ఎలా పంపించారని ఎపిఒ రామకృష్ణను అడిగారు. ప్రజా ప్రతినిధులకు విలువలేకుండా చేస్తున్నావని, టిడిపి, వైసిపిల మధ్య గొడవలు పెడుతున్నావన్నారని ఆరోపించారు .అదేవిధంగా పనులు మంజూరైన ప్రతులను, పంచాయితీ తీర్మానాలను చూపించాలని అడగ్గా ఎపిఒ చూపించారు. ఇవన్నీ తమకు తెలియకుండా జరిగాయని, సర్పంచులకు చెప్పకుండా గ్రామ సభలు నిర్వహించి, తీర్మానాలు చేశారని శివరాంపురం, పారన్న వలస సర్పంచులు జరజాపు మోహన్, చొంగలి లక్ష్మణలు ఆరోపించారు. దీంతో వైస్ ఎంపీపీ కల్పించుకొని మండలంలో ఏ పనులు, ఎక్కడ మంజూరయ్యాయో అధికారులు చెబితే తప్ప మాకు తెలియదని, ఆ విధంగా మీరు చేస్తున్నారని ఎపిఒను నిలదీశారు. దీనితో ఎపిఒ తీర్మానాల పత్రాలను చూపించగా వాటి సంగతి తెలుసని వైస్ ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే తీర్మానాల మేరకే చేశామని, దొంగతనంగా చేయాల్సిన అవసరం లేదని ఎపిఒ అనగా ఖరాసు వలస ఎంపిటిసి అప్పికొండ రమాదేవి, ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి కల్పించుకొని గొడవలు అనవసరమని, అభివృద్ధి జరిగేలా చూడాలని అన్నారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, ఎపిఒ కారణంగా గొడవలు జరుగుతున్నాయన్నారు. ఈ దశలో అన్నంరాజు వలస ఎంపిటిసి సీదరపు అనూష, నార్లవలస సర్పంచ్ బేటుకూరి రామ్మూర్తిలు మాట్లాడుతూ నార్ల వలసలో ఉపాధి హామీ పనులు సక్రమంగా జరగడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రెండవ వైస్ ఎంపీపీ సువ్వాడ గుణవతితో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కేసులు

ప్రజాశక్తి- సాలూరు

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని స్థానిక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జెవి ఎస్ఎస్ఎస్ ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం పాచిపెంట మండలంలోని పాంచాలి జంక్షన్‌లో ఆటో డ్రైవర్, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులను హెల్మెట్ ధరించాలని కోరారు. వాహనాలకు సంబంధించిన అన్ని రకాల పత్రాలు కలిగి వుండాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రవాణా సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పాలకొండ

రిమాండ్ ఖైదీలను సబ్ జైలుకు తీసుఒచ్చినప్పుడు, కోర్టు వాయిదాల కోసం బయటకు వచ్చి తిరిగి జైలకు వెళ్లిప్పుడు నిశితంగా తనీఖీ చేసి లోపలికి తీసుకొని రావాలని జిల్లా సబ్ జైలు అధికారి కె.మోహన్ రావు, సూపరింటెండెంట్ బి.జోగులు సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక సబ్ జైలను వారు ఆకస్మికంగా సందర్శించి పలు సూచనలు చేశారు. ఇటీవల విశాఖ సెంట్రల్ జైల్లో జరిగిన సంఘటన దృష్ట్యా జైలు సిబ్బంది విధి నిర్వాహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సబ్ జైలు పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.రిమాండ్ ఖైదీలకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలు అందజేయాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. కార్యక్రమంలో హెడ్‌వార్డర్ పి.చంద్రరావు, ఎఎస్ఐ శ్రీనివాసరావు, డిపిటి నాయుడు, నాగరాజు, సత్యారావు నాయుడు పాల్గొన్నారు.

బీరుపాడులో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మారుమూల ప్రాంతమైన బీరుపాడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి సిహెచ్ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అప్పుడే ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని చెప్పారు. ఆధార్, 1-బిని రైతు భరోసా కేంద్రానికి తీసుకువెళ్లి ఆధార్‌తో మొబైల్ లింక్ చేయించుకోవాలన్నారు. మండలం మొత్తం మీద 7వేల మంది రైతులకు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 500 రిజిస్ట్రేషన్లు జరిగాయని తెలిపారు. వ్యవసాయ పరికరాలు, రాయతీలపై రైతులకు అవగాహన కల్పించారు.

సీతానగరం : పొలం పిలుస్తుంది లో భాగంగా మండలంలోని జనుముల్లువలస, గాదెలవలసలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అవినాష్ మాట్లాడుతూ రైతులు ప్రతి ఒక్కరూ ఈ పోర్టల్ లో తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రైతులు వారి పాస్ పుస్తకాలు అనుసంధానం జరిగిన ఆధార్, మొబైల్ నెంబర్ తీసుకొని రైతు సేవాకేంద్రం సిబ్బంది వద్ద ఒటిపి, బయోమెట్రిక్ విధానం ద్వారా రైతుకు 11 అంకెలతో ఒక నెంబర్ వస్తుందన్నారు. ఈనెల ఆఖరి లోపు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయబడుతుందని, కావున తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విఎఎలు పాల్గొన్నారు.

ముగిసిన మహాలక్ష్మి పేరంటాల మహోత్సవం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తెట్టంగి నిర్వహిస్తున్న 48వ మహాలక్ష్మి పేరంటాల మహోత్సవం మంగళవారంతో ముగిసింది. భక్తులు ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాలైన క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి గుజ్జల నారాయణరావు- జయలక్ష్మి దంపతులు బహుమతులు అందజేశారు. విజయవాడ వారిచే చింతామణి బుర్రకథ కడు రమ్యంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పి లక్ష్మణరావు, పి పరశబాబు, ఎస్ చిన్నంనాయుడు, ఏ ఏలియా, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రై షోయింగ్‌షోతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రబీ డ్రై షోయింగ్ షో పంటలతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వీలుంటుందని జిల్లా ప్రకృతి వ్యవసాయం మేనేజర్ పి షణ్ముఖరాజు అన్నారు. జియమ్మవలస మండలంలోని రామినాయుడువలస గ్రామంలో వైకుంటపు త్రినాథ పొలంలో రబీ డ్రైషోయింగ్ షోలో భాగంగా నువ్వులు ప్రధాన పంటలో ముల్లంగి, గోంగూర, చిక్కుడు, బెండ, కొత్తిమీర పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట మార్పిడి విధానం ద్వారా వరి తరువాత అపరాలు నువ్వులతో పాటు అదనపు ఆదాయం కోసం పలు పంటలు వేయడం వల్ల రైతులు త్వరితగతిగా అభివృద్ధి చెందుతారన్నారు. ఇలాంటి పంటలతో ఇంటి అవసరాలు తీర్చుకోవడానికి కాకుండా, ప్రకృతిని పరిరక్షించడం, మొక్కలలో జీవ వైవిధ్యం పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 15 మండలాల్లోని ప్రతి గ్రామంలోని, ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ పంటలతో దిగుబడులు సాధించడం, ఏడాది పొడవునా పంటలు పండించడంతో ఆర్థికాభివృద్ధి సాధిస్తారన్నారు. రైతులు పెట్టుబడులు తగ్గించి, దిగుబడులు సాధించడం దిశగా కృషి చేయాలని సూచించారు. అందుకు ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జి బి.లత, పార్వతి, రైతులు వేమల పోలినాయుడు, ఎం.గౌరూనాయుడు, శివున్నాయుడు, మరడాన, గౌరునాయిడు తదితరులు పాల్గొన్నారు.

సిరిమాను చెట్టుకు పూజలు

ప్రజాశక్తి - సాలూరు

మే 16,17,18 తేదీల్లో నిర్వహించనున్న శ్యామలాంబ పండుగ నేపథ్యంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం సిరిమాను చెట్టుకు పూజలు నిర్వహించారు. ఆర్‌సిఎం పాఠశాల వెనుక ఉన్న పాచి చెట్టును సిరిమాను కోసం ఎంపిక చేశారు. సాంప్రదాయ బద్ధంగా ఉత్సవ కమిటీ ఛైర్మన్ అక్కేన అప్పారావుతో సహా సభ్యులు, పెద్దలు పూజలు నిర్వహించారు. అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు కూనిశెట్టి భీమారావు, పట్టణ టిడిపి అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఇండుపూరి నారాయణ రావు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి 50 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య తరఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బరువు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులకు శ్రీ అన్నపూర్ణ నిత్యసేవా మందిరం నుంచి భోజనం సరఫరా చేశారు. పిఎం ఎస్ఎంఎ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంత కుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న ఆర్‌టిసి డిఎం, వైద్యాధికారి, ఎంవిఐ

క్షతగాత్రులకు రక్తం ఎంతో అవసరం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రోడ్డు ప్రమాదాలు జరిగే సమయాలలో క్షతగాత్రులకు రక్తం అవసరం ఎంతో ఉంటుందని జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి. సత్యనారాయణ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో సత్యనారాయణ, ఆర్‌టిసి డిఎం దుర్గతో పాటు, ఆసుపత్రి వైద్యులు నారాయణ రక్తదానాన్ని చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతిరోజు పలు సందర్భాల్లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎంతోమంది క్షతగాత్రులవుతున్నారని, అలాంటి సమయంలో వైద్య చికిత్స కొరకు రక్తం ఎంతో అవసరమని, ఆ అవసరాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చి తోటి వారి ప్రాణాలు కాపాడాలని అన్నారు. ఈ రక్తదాన శిబిరంలో పలువురు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

ఎఎంసి మాజీ ఛైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ

పార్వతీపురంరూరల్ : ఇటీవలే కంటికి ఆపరేషన్ చేయించుకున్న టిడిపి సీనియర్ నాయకులు, ఎఎంసి మాజీ ఛైర్మన్ రెడ్డి శ్రీనివాసరావును ఆయన స్వగ్రామమైన కృష్ణపల్లికి ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొవాలని కోరారు.

ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సాలూరురూరల్

టేకు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ మరడ తిరుపతిరావు (49)అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. తెర్లాం మండలం సంగిరెడ్డివలసకు చెందిన ఓ రైతు వద్ద తిరుపతిరావు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ట్రాక్టర్ యజమాని సాలూరు మండలంలోని గల కరాసువలస వద్ద టేకు మొక్కలు కొనుగోలు చేసి కటింగ్ జరిపిన అనంతరం ట్రాక్టర్ లోడ్ వేసి తమ స్వగ్రామమైన సంగిరెడ్డివలసకు తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో వసుపువానివలస వద్ద రోడ్డు గుంతలు ఎక్కువగా ఉండడంతో అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ సంఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ తిరుపతిరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రూరల్ ఎస్ఐ నరసింహమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

జియమ్మ వలస మండలం అలమండలో నీలకంఠాపురం, నిడగల్లుగూడ జరుగుతున్న పిఎం జన్మాన్ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపిడిఒ ఎస్.రమేష్ మంగళవారం పరిశీలించారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణం పనులు వేగవంతంగా చేపట్టాలని, శ్లాబ్ లెవెల్‌లో ఉన్న ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఇంటి నిర్మాణం పూర్తయిన వెంటనే బిల్లు మంజూరు చేస్తామన్నారు. మార్చి 31 నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన వారు బిల్లులు పొందుతారని అన్నారు.

జియో ట్యాగింగ్ పూర్తికి చొరవ చూపాలి

వీరఘట్టం : గృహ లబ్ధిదారుల జియో ట్యాగింగ్ పూర్తికి చొరవ చూపాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. పిఎం సూర్యఘర్, ఎంఎస్ఎం ఈ సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఒ బి.వెంకట రమణ, ట్రాన్స్‌కో ఎఇ అనిల్ కుమార్, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.